క్లుప్తంగా

శ్రీవారి సేవలో..



శ్రీవారి ఆలయంలో ఎమ్మెల్యే వాసుబాబు

ద్వారకాతిరుమల : ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు గురువారం సందర్శించారు. ముందుగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు దేవస్థానం అధికారులు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వాసుబాబు స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆయనకు శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలికారు. ఆ తరువాత స్వామివారి మెమెంటోను, ప్రసాదాలను అందజేశారు.

సువర్ణ పుష్పాల బహూకరణ



స్వామికి సమర్పించిన సువర్ణ పుష్పాలు

కొయ్యలగూడెం : శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత మదనగోపాల స్వామి వారికి హైదరాబాద్‌కు చెందిన చండిక దుర్గా రామ కోటేశ్వరరావు, హేమశ్రీ దంపతులు 108 సువర్ణ రజిత పుష్పాలు బహూకరించారు. ఈ సువర్ణ పుష్పాలను గురువారం ఆలయ అర్చకులు గుడిపూడి శేషాచార్యులకు అందజేశారు. పర్వదినాల్లో స్వామివారికి ఈ సువర్ణ పుష్పాలతో పూజలు నిర్వహించాల్సిందిగా భక్తులు కోరినట్లు అర్చకులు తెలిపారు.

వైద్య సిబ్బంది చేయూత



బాధితులకు స్టీల్ సామాగ్రి అందించిన దృశ్యం

వేలేరుపాడు : కన్నాయిగుట్టలో రెండు రోజుల క్రితం జరిగిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన కుటుంబాలకు గురువారం కోయిదా పీహెచ్‌సీ పరిధిలోని వైద్య సిబ్బంది సహాయం అందించారు. ప్రభుత్వ వైద్యులు నాగ గణేష్, మాధురి ఆధ్వర్యంలో స్థానిక వైద్య సిబ్బంది కలిసి 27 బాధిత కుటుంబాలకు స్టీల్ సామాగ్రి అందజేశారు. సర్వం కోల్పోయిన ఆయా కుటుంబాలకు ప్రతి ఒక్కరూ సహాయం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.సీత, నాగరత్నం, విజయలక్ష్మి, బుచ్చయ్య, ఎం.విజయ్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం



బాధితులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం : ఇటీవల గిరిజన ప్రాంతంలో సంభవించిన వివిధ అగ్ని ప్రమాదాల్లో సర్వం కోల్పోయిన కుటుంబాల వారికి గురువారం ఫాదర్ టి.ఇమ్మానుయేలు, పందిరిమామిడిగూడెం ఆర్‌సీఎం చర్చి విచారణ గురువు ఫాదర్ కె.అరులప్పల చేతుల మీదుగా ఆర్థిక సహాయాన్ని అందజేశారు. 7 కుటుంబాలకు 25 కేజీల బియ్యం, 5 కేజీల కందిపప్పు, 5 కేజీల మంచినూనెతోపాటు నూతన వస్త్రాలను, వంట సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏలూరు సోషల్ సర్వీస్ సెంటర్ బిషప్ పొలిమేర జయరావు ఆదేశాల మేరకు బాధితులకు ఆర్థిక సహాయాన్ని అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ నక్కా కృపానందం, సోషల్ సర్వీస్ సెంటర్ పీఓ టి.బాలస్వామి, కోఆర్డినేటర్, సామాజిక కార్యకర్త పెద్దిరెడ్డి మూర్తి, బొల్లి విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణులు రాణించాలి



కనకారావును సత్కరిస్తున్న సంఘ సభ్యులు

ద్వారకాతిరుమల : నాయీ బ్రాహ్మణులు అన్ని రంగాల్లోను రాణించాలని ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షులు మార్కాపురం కనకారావు అన్నారు. గుణ్ణంపల్లిలో గురువారం ఆయన స్థానిక నాయీ బ్రాహ్మణులతో సమావేశాన్ని నిర్వహించారు. నాయీ బ్రాహ్మణులకు ఏవైనా సమస్యలు వస్తే తాను తోడుగా ఉంటానని కనకారావు భరోసానిచ్చారు. ఈ సందర్భంగా కనకారావును నాయీ బ్రాహ్మణులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ బీసీ చైతన్య సమితి ఏలూరు జిల్లా అధ్యక్షులు యడ్లపల్లి నటరాజు, సతీష్, నాగేశ్వరాల వాసు, కలవకొల్లు రాంబాబు, అరిగెల దుర్గయ్య తదితరులున్నారు.

మహిళలకు సన్మానం

చింతలపూడి : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని చింతంపల్లి గ్రామంలో గురువారం సేవ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ తాండ్ర రామకృష్ణారావు మాట్లాడుతూ నేడు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని అన్నారు. అనంతరం వివిధ రంగాల్లో పని చేస్తున్న మహిళలను సభలో సన్మానించారు. సేవ కార్యదర్శి ఉప్పే రాజారావు, మాజీ సర్పంచ్ తాండ్ర సీతాదేవి పాల్గొన్నారు.

త్వరలో బైనేరుపై రెండో బ్రిడ్జి

రూ.12 కోట్లతో కొయ్యలగూడెం – జంగారెడ్డిగూడెం మధ్య హైవేపై నిర్మాణం



కొయ్యలగూడెం - జంగారెడ్డిగూడెం మధ్య బైనేరు వాగుపై ఉన్న హైవేపై ఉన్న బ్రిడ్జి



బైనేరు వాగు పాత బ్రిడ్జిపై వాహనాల రాకపోకలతో రద్దీగా ఉన్న దృశ్యం

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం – జంగారెడ్డిగూడెం మధ్య బైనేరు వాగుపై రెండో వంతెన నిర్మాణం త్వరలో రూపు దాల్చనుంది. దేవరపల్లి తల్లాడ జాతీయ ప్రధాన రహదారి–516 (డి) విస్తరణ నేపథ్యంలో ఇప్పటికే 60 కిలోమీటర్లు మేర రోడ్డు నిర్మాణం పూర్తయిన సంగతి తెలిసిందే. అయితే ప్రస్తుతం బైనేరు వాగుపై నిర్మించిన వంతెన మీదుగా వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో నిత్యం ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో మినిస్ట్రీ ఆఫ్ రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ హైవేస్ ఆధ్వర్యంలో రెండో వంతెన నిర్మించాలని నిర్ణయించారు. ప్రస్తుతం వాగుపై ఉన్న వంతెన కొయ్యలగూడెం నుంచి జంగారెడ్డిగూడెం వైపు వెళ్లడానికి కేటాయిస్తామని, కొత్త బ్రిడ్జి నిర్మాణం పూర్తయిన పిదప జంగారెడ్డిగూడెం నుంచి కొయ్యలగూడెం వైపు వెళ్లే విధంగా బ్రిడ్జికి ముందు వైపు రెండో బ్రిడ్జిని నిర్మిస్తున్నట్లు నేషనల్ హైవే ఏఈ సబీరా చెబుతున్నారు. ప్రస్తుతం ఉన్న బ్రిడ్జి పొడవు, వెడల్పులతోనే నిర్మాణం చేపడతామని, ఇప్పటికే కాంట్రాక్టర్ మెటీరియల్‌ని సిద్ధం చేసుకోవడానికి ఫైర్‌స్టేషన్ ఎదురుగా ఉన్న స్థలాన్ని లీజుకు తీసుకున్నట్లు తెలిపారు. కొయ్యలగూడెం వైపు ఫైర్‌స్టేషన్ రోడ్డు జంక్షన్ నుంచి జంగారెడ్డిగూడెం వైపు 650 మీటర్ల పొడవున రోడ్డును విస్తరించనున్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



దాత సోంబాబును సత్కరిస్తున్న ఆలయ కమిటీ

జంగారెడ్డిగూడెం : శ్రీ విజయదుర్గ అమ్మవారి ఆలయ అభివృద్ధికి పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త కొనకళ్ల పెద సోంబాబు రూ. 50,116 విరాళం అందించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ మారిశెట్టి రాధాకృష్ణ తెలిపారు. అమ్మవారిని సోంబాబు దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం దాత సోంబాబును వేదాశీర్వాదం, శేష వస్త్రాలతో ఆలయ కమిటీ సత్కరించింది.

స్త్రీల హక్కులపై అవగాహన

జంగారెడ్డిగూడెం రూరల్ : భారత రాజ్యాంగం స్త్రీలకు కల్పించిన ప్రత్యేక హక్కులను వినియోగించుకోవాలని సీనియర్ న్యాయవాది మేకా ఈశ్వరయ్య అన్నారు. తాడువాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా స్త్రీల హక్కులపై అవగాహన కల్పించారు. సర్పంచ్ యర్రమళ్ల సత్యవతి, మహిళా న్యాయవాదులను సత్కరించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు



జంగారెడ్డిగూడెం ఎంపీడీవో కార్యాలయం వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న డీఎస్పీ కేవీ సత్యనారాయణ



బుట్టాయగూడెంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎంపీటీసీలు, నాయకులు

జంగారెడ్డిగూడెం : ఈనెల 13న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు డీఎస్పీ కేవీ సత్యనారాయణ తెలిపారు. జంగారెడ్డిగూడెం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌బూత్‌ను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 13వ తేదీన జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా జంగారెడ్డిగూడెం ఎంపీడీవో కార్యాలయం వద్ద పకడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు. ఈ ఎన్నికల్లో 184 మంది ఓటర్లు తమ ఓటును వినియోగించుకోనున్నట్లు తెలిపారు. చింతలపూడి, పోలవరం నియోజకవర్గాల్లోని 10 మండలాల నుంచి ఎంపీ, ఇద్దరు ఎమ్మెల్యేలు, జెడ్పీటీసీ 10 మంది, కౌన్సిలర్‌లు 29, ఎంపీటీసీలు 142 మంది మొత్తం 184 మంది ఓటు వేయనున్నారన్నారు. కాగా పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల దూరంలో బారీ కేడ్‌లు ఏర్పాటు చేసి 144 సెక్షన్ విధించినట్లు తెలిపారు. 100 మీటర్లకు ముందు వాహనాలను పార్కింగ్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. బ్యాలెట్ ఓటింగ్ కావున ఓటు వేసే వారు సెల్‌ఫోన్ గాని, వాటర్ బాటిల్‌గాని, ఇంకు బాటిల్ గాని తీసుకురావడాన్ని నిషేధించినట్లు తెలిపారు.

169 మందితో బందోబస్తు

అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించేందుకు 169 మందితో బందోబస్తు ఏర్పాటుచేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఇద్దరు డీఎస్పీలు, ముగ్గురు సీఐలు, 16మంది ఎస్సైలు, ఏఎస్సైలు 13, పీసీలు 69లతో కలిపి మొత్తం 169 మంది విధులు నిర్వహిస్తారన్నారు. అలాగే జంగారెడ్డిగూడెం డివిజన్‌లోని ఆయుధాలు కలిగిన వారిని ఎడ్యుకేట్ చేయడంతో పాటు, సస్పెక్ట్స్, రౌడీషీటర్‌లను బైండోవర్ చేస్తున్నట్లు చెప్పారు. జంగారెడ్డిగూడెం సీఐ బాలసురేష్‌బాబు, ఎస్సై ఎం.సాగర్ బాబు ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. ఈ బందోబస్తుకు పోలవరం డివిజన్ నుంచి కొంతమంది సిబ్బంది తీసుకుంటున్నట్లు తెలిపారు. రెవెన్యూ తరుపున ఆర్డీవో ఎం.ఝాన్సీరాణి పర్యవేక్షిస్తారని డీఎస్పీ తెలియజేశారు.

ఊపందుకున్న ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

బుట్టాయగూడెం : ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులుగా బరిలో నిలిచిన కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రల గెలుపు కోసం పోలవరం నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారాన్ని పార్టీ నాయకులు ముమ్మరం చేశారు. గురువారం టి.నర్సాపురం మండల జెడ్పీటీసీ సామంతపూడి సూరిబాబు ఆధ్వర్యంలో బుట్టాయగూడెం మండల పార్టీ కన్వీనర్ అల్లూరి రత్నాజీరావు, సొసైటీ అధ్యక్షులు ఆరేటి సత్యనారాయణ, యువజన విభాగం నాయకులు కరాటం కృష్ణస్వరూప్, స్థానిక సొసైటీ కళ్యాణ మండపంలో పోలింగ్‌పై ఎంపీటీసీలకు అవగాహన కల్పిస్తూ మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీల ద్వారా రైతులకు మరిన్ని సేవలు



బుట్టాయగూడెంలో గోడౌన్‌ను సందర్శించిన ఏడీఏ బుచ్చిరాజు, ఏఓ సుమలత

బుట్టాయగూడెం: ప్రతి రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన కస్టమ్ హైరింగ్ సెంటర్‌ల ద్వారా రైతులకు మరిన్ని సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని కేఆర్‌పురం వ్యవసాయ సంచాలకులు పీజీ బుచ్చిరాజు చెప్పారు. స్థానిక బీసీఎంఎస్ ఎరువుల గోడౌన్‌ను ఆయన గురువారం సందర్శించారు. అనంతరం అక్కడ ఎరువుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కస్టమ్ హైరింగ్ సెంటర్‌ల ద్వారా రైతులకు రుణసదుపాయం, వ్యవసాయ పరికరాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గత ఏడాది 111 గ్రూప్‌లు ఉండగా వీటిలో 12 గ్రూప్‌లకు ఒక్కో గ్రూప్‌కు రూ.6 లక్షల సబ్సిడీతో రుణాలు అందజేసినట్లు తెలిపారు. ఒక్కొక్క గ్రూప్‌కు రూ.15 లక్షల వరకూ రుణసదుపాయం కల్పించే అవకాశం ఉందన్నారు. ఇందులో 40 శాతంతో రూ. 6 లక్షల వరకూ సబ్సిడీ ఇస్తామని చెప్పారు. ట్రాక్టర్‌లు, రోటోవీటర్‌లు, స్ప్రేయర్‌లు, టార్పల్స్ వంటి వ్యవసాయ పరికరాలను రైతులు ఆ సొమ్ములతో కొనుగోలు చెయ్యాల్సి ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ బి.సుమలత, ఏఈఓలు, తదితరులు పాల్గొన్నారు.

మారుమూల ప్రాంతాలకు బీఎస్ఎన్ఎల్ సేవలు



మాట్లాడుతున్న బీఎస్ఎన్ఎల్ జీఎం శ్రీను తదితరులు

బుట్టాయగూడెం: గిరిజన మారుమూల గ్రామాల్లో సైతం బీఎస్ఎన్ఎల్ సేవలు విస్తరింపజేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ ఎల్.శ్రీను తెలిపారు. మండలంలోని గొల్లగూడెంలో ఏర్పాటు చేస్తున్న బీఎస్ఎన్ఎల్ టవర్ పనుల పురోగతిని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గిరిజన ప్రాంతంలో మంజూరైన సెల్ టవర్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా కృషి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బుట్టాయగూడెం, పోలవరం, జీలుగుమిల్లి, జంగారెడ్డిగూడెం మండలాల పరిధిలోని గ్రామాల్లో బీఎస్ఎన్ఎల్ సేవలు అందించేందుకు సుమారు 50 సెల్‌టవర్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బుట్టాయగూడెం మండలంలో 39, పోలవరంలో 6, జీలుగుమిల్లిలో 4, జంగారెడ్డిగూడెంలో 1 చొప్పున సెల్ టవర్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వేలేరుపాడు మండలాలకు సంబంధించి టవర్‌లు మంజూరు కాగా వాటిని పునరావాస కాలనీల్లో ఏర్పాటు చేస్తామని తెలిపారు. రాబోయే మూడు నెలల్లో పూర్తి స్థాయిలో మారుమూల గ్రామాల్లో సైతం బీఎస్ఎన్ఎల్ సేవలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. బుట్టాయగూడెం మండలంలో లంకపాకలు, రేగులపాడు, రేపల్లె, గొట్టాలరేవు, తదితర అటవీ ప్రాంతంలోని గ్రామాల్లో కూడా సెల్‌టవర్‌లు ఏర్పాటు చేసి గిరిజన ప్రాంత ప్రజలకు కమ్యూనికేషన్ సేవలు అందించేలా కృషి చేస్తామని చెప్పారు. బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు కూడా అందుబాటులోకి వచ్చాయని వాటిని వినియోగదారులకు అందుబాటులోకి తెచ్చేలా కృషి చేస్తున్నామని చెప్పారు. ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల పరిధిలోని ప్రజలకు మెరుగైన సేవలు అందించే విధంగా ఇంటర్‌నెట్ ప్రొటోకాల్ టెలివిజన్(ఐపీటీవీ) సేవలను అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. ఐపీటీవీ ద్వారా ఇంటర్‌నెట్, టీవీ, వీడియో కాన్ఫరెన్స్ వంటి సేవలు వినియోగించవచ్చని అన్నారు. అదేవిధంగా టెలీమెడిసిన్ సేవలను కూడా వినియోగించుకునే అవకాశం ఉందన్నారు. బీఎస్ఎన్ఎల్ సేవలను ప్రజలందరికీ అందించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో డీజీఎం సోమయాజులు, ఏజీఎం ఎం. వెంకటరత్నం, డీఈలు టి. దేవరాజ్, రవిచంద్ర, జంగారెడ్డిగూడెం బీఎస్ఎన్ఎల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో లేగ దూడలను సంరక్షించాలి



సాగిపాడులో లేగదూడల ప్రదర్శన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

కామవరపుకోట : వేసవికాలంలో లేగ దూడలను సంరక్షించే విధంగా చర్య తీసుకోవాలని ఏపీఎల్‌డీఏ డిప్యూటీ డైరెక్టర్ జేసుదాసు అన్నారు. గురువారం మండలంలో సాగిపాడు గ్రామంలో పశువర్ధక శాఖ ఆధ్వర్యంలో లేగ దూడల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పాడి రైతులకు పాల కేన్లను, పశువుల మందులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూగజీవులు తీవ్ర అనారోగ్యానికి గురైతే 108 తరహాలో గ్రామీణ ప్రాంతాల్లో పశువులకు వైద్య సేవలు అందించేందుకు 1962 టోల్ ఫ్రీ నెంబర్ తో సంచార పశు వైద్య సేవలను అందిస్తున్నారని, దీనిని రైతులు వినియోగించుకోవాలన్నారు. లేగ దూడలకు క్రమం తప్పకుండా నట్టల మందులు వాడాలన్నారు. అనంతరం వేసవి కాలంలో దూడల సంరక్షణ, లేగ దూడల పెంపకంలో రైతులు ఎదుర్కొనే సమస్యలపై తగిన సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో ధర్మాజీగూడెం పశు సంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ టీఆర్‌కే ప్రసాద్, తడికలపూడి వెటర్నరీ డాక్టర్ ఎల్‌వీ సుప్రియ, కామవరపుకోట వెటర్నరీ డాక్టర్ వి.ఆదిత్యకుమార్, వెటర్నరీ సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టు శిక్షణ ప్రారంభం



మాట్లాడుతున్న ఓఎన్‌జీసీ జనరల్ మేనేజర్ కృష్ణ

పోలవరం రూరల్ : గిరిజన నిర్వాసిత మహిళలు కుట్టుశిక్షణ పొంది తద్వారా ఆర్థికంగా ఎదగాలని ఓఎన్‌జీసీ జనరల్ మేనేజర్ బి.కృష్ణమూర్తి అన్నారు. పోలవరం మండలం కొండ్రుకోట ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఐటీడీఏస్ సంస్థ ఆధ్వర్యంలో సీఎస్ఆర్ సహకారంతో ఓఎన్‌జీసీ ఆర్థిక సహాయంతో నిర్వాసిత మహిళలకు కుట్టుమిషన్ శిక్షణా సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ కృష్ణ మాట్లాడుతూ ప్రాజెక్టులో నిర్వాసితులైన గిరిజన మహిళలకు కుట్టు శిక్షణ ఇచ్చి వారు తయారుచేసే వస్తువులను మార్కెట్‌లో అమ్ముకునేందుకు వీలుగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. రెండు నెలల పాటు నైపుణ్యంతో కూడిన శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. మారుమూల ప్రాంతాల్లోని గిరిజనులకు ఆర్థికంగా బలపడటానికి ఈ శిక్షణ తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో డీజీఎం వి.వెంకన్న, సీఎస్ఆర్ ఫౌండేషన్ ప్రతినిధి వి.శ్రీనివాసరావు, ఐటీడీఏస్ సంస్థ డైరెక్టర్ జి.అనిల్‌కుమార్, సర్పంచ్ పైదా నాగరాజు, ఉప సర్పంచ్ కె.బద్రాజు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికుడి కుటుంబీకుల నిరసన



వ్యవసాయ భూమిలో నిరసన వ్యక్తం చేస్తున్న మాజీ సైనికుడి కుటుంబీకులు

కొయ్యలగూడెం: ప్రభుత్వం తమకు ఇచ్చిన వ్యవసాయ భూమి అన్యాక్రాంతమవుతోందని, అధికారులు రక్షణ కల్పించాలంటూ ఓ మాజీ సైనికుడి కుటుంబీకులు చొప్పరామన్నగూడెంలో గురువారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా కొల్లి గ్రాబియేల్ మాట్లాడుతూ చొప్పరామన్నగూడెం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 102/1లో ఐదెకరాల భూమిని మిలటరీలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన తన తండ్రి కొల్లి వెంకన్నకు 1947లో అప్పటి జిల్లా కలెక్టర్ సైనిక వెల్ఫేర్ కోటాలో కేటాయించారని చెప్పారు. అప్పటి నుంచి తమ కుటుంబీకులమే భూమి సాగు చేసుకుంటున్నామని తెలిపారు. ఇటీవల చేసిన జగనన్న భూరీసర్వేలో కూడా తమ తండ్రి పేరు మీదనే రికార్డులు చూపించినప్పటికీ, అధికారులు మాత్రం చెరువు పోరంబోకు భూమి అంటూ తప్పుడు నివేదికలు ఉన్నతాధికారులకు పంపించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే అదునగా భావించి పొంగుటూరుకు చెందిన ఓ వ్యక్తి తమకు చెందిన రెండు ఎకరాలను ఆక్రమించి చెరుకు సాగు చేస్తున్నాడన్నారు. దీనిపై తాము ఫిర్యాదు చేయగా, రెవెన్యూ అధికారులు అతనిపై చర్యలు తీసుకోకపోగా అతనికి అనుకూలంగా పొలం వదిలివేయమని తమపై ఒత్తిడి తెస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం జరగకపోతే కుటుంబ సభ్యులంతా తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాల ఎదుట ధర్నా చేపడతామన్నారు. ఈ నిరసనలో కొల్లి వెంకన్న మనుమడు అయ్యన్న, మనుమరాళ్లు జ్యోతి, రత్నకుమారి తదితరులు పాల్గొనగా వారికి గ్రామస్తులు మద్దతు ఇచ్చారు.

మానవత ఆర్థిక సహాయం

కొయ్యలగూడెం : కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న రోగికి కొయ్యలగూడెం మానవత శాఖ గురువారం ఆర్థిక సహాయం అందజేసింది. పొంగుటూరుకి చెందిన బల్లి బాబురావు అనే వ్యక్తికి రెండు కిడ్నీలు చెడిపోవడంతో విషయం తెలుసుకున్న మానవత సభ్యులు రూ.3 వేలు ఆర్థిక సహాయం అందచేశారు. మండల వ్యాప్తంగా సేవా కార్యక్రమాల్లో గతేడాది 25కి పైగా కుటుంబాల వారికి రూ.75 వేల వరకు ఆర్థిక సహాయం మానవత ద్వారా అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో కొయ్యలగూడెం మానవత శాఖ ట్రెజరర్ దిద్దే ఎబినేజర్, వైస్ ప్రెసిడెంట్ నాగేశ్వరరావు, ముప్పనపల్లి వెంకటేశ్వర, కర్రి సూరిబాబు, కిషోర్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలి



మాట్లాడుతున్న తాటిపర్తి రాజు

చింతలపూడి : వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయడమే ధ్యేయంగా పని చేస్తానని వైఎస్సార్ సీపీ ఐదు జిల్లాల వికలాంగుల విభాగం జోనల్ ఇన్‌చార్జ్ తాటిపర్తి రాజు అన్నారు. స్థానిక మార్కెట్ కమిటీ ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో తాటిపర్తి రాజును ఏఎంసీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి, ఎంపీపీ డా.రాంబాబు నాయక్, జెడ్పీటీసీ ఎం.నీరజా సుధాకర్ ఘనంగా సత్కరించారు. దివ్యాంగుల కోసం ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఈ సందర్భంగా తన సేవలను గుర్తించి తనను కాకినాడ, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల జోనల్ ఇన్‌చార్జ్‌గా నియమించినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే వీఆర్ఎలీజా, ఏఎంసీ చైర్ పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

జూదరుల అరెస్ట్

టి.నరసాపురం : పేకాట శిబిరంపై దాడి చేసి 10 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.సతీష్‌కుమార్ తెలిపారు. మండలంలోని తిరుమలదేవిపేట గ్రామ శివారులోని పామాయిల్ తోటలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు దాడి చేసి 10 మందిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.8200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చింతలపూడి : విద్యుత్ స్తంభాల మరమ్మతుల నిమిత్తం చింతలపూడిలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని ఏపీఈపీడీసీఎల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కేఎం అంబేద్కర్ గురువారం తెలిపారు. అదే విధంగా మండలంలోని శంఖచక్రపురం సబ్‌స్టేషన్లో మరమ్మతుల నిమిత్తం ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 33/11కేవీ ఫీడర్ కూడా సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

టి.నరసాపురం : కామవరపుకోట విద్యుత్ కేంద్రంలో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్‌సరఫరా నిలిపివేస్తామని ఏపీఈపీడీసీఎల్‌ఈఈ కేఎం అంబేద్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని టి.నరసాపురం, రాజుపోతేపల్లి విద్యుత్ ఉపకేంద్రాల పరిధిలో విద్యుత్ అంతరాయం, వ్యవసాయ వినియోగదారులకు వ్యవసాయ విద్యుత్ వేళల్లో మార్పులు ఉంటాయన్నారు.

రేపటి నుంచి విర్డ్‌లో వైద్య శిబిరం

ద్వారకాతిరుమల : స్థానిక విర్డ్ ఆస్పత్రిలో ఈనెల 11 నుంచి 13 వరకు చారిటబుల్ ఆర్థోపెడిక్ ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఆస్పత్రి ట్రస్టు చైర్మన్ ఎస్వీ.సుధాకరరావు తెలిపారు. ఈ శిబిరంలో అమెరికాకు చెందిన ప్రముఖ వైద్యులు కామినేని శ్రీనాధ్ రోగులకు సేవలు అందిస్తారన్నారు. భుజం, మోచెయ్యి (ఎముక, జాయింట్) సమస్యలు ఉన్న వారు తమ రిపోర్టులతో ఆస్పత్రికి వచ్చి, ఈ సేవలను పొందాలని కోరారు. అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ, ఈహెచ్‌ఎస్ ద్వారా ఉచితంగా శస్త్రచికిత్సలు చేయనున్నట్లు తెలిపారు. వివరాలకు 83744 45108, 08829–271177 నంబర్లలో సంప్రదించాలన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

కుక్కునూరు : క్రీడల వలన శారీరక దారుఢ్యంతో పాటు మానసికోల్లాసానికి దోహదం చేస్తాయని వైఎస్సార్ సీపీ మండల యూత్ నాయకులు రావు వినోద్ పేర్కొన్నారు. దాచారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ ముగిసింది. గురువారం జరిగిన ఫైనల్స్‌లో వేలేరుపాడు జట్టు, తాట్కూర్ గొమ్ము జట్టుపై విజయం సాధించి ట్రోఫీని కైవసం చేసుకుంది. ప్రథమ స్థానంలో నిలిచిన వేలేరుపాడు జట్టుకు రావు వినోద్ చేతుల మీదుగా రూ.30 వేలు నగదు, షీల్డ్, రన్నరప్‌గా నిలిచిన తాట్కూర్‌గొమ్ము జట్టుకు ఎస్సై శ్రీనివాస్ చేతుల మీదుగా రూ.15 వేల నగదు, షీల్డ్‌ను అందించారు.

రవన్న సేవలు ఎనలేనివి

బుట్టాయగూడెం : పేదలు, ఆదివాసీలు, దళితులు, మైనారిటీల కోసం రాయల సుభాష్ చంద్రబోస్ చేసిన సేవలు అందరికీ ఆదర్శనీయమని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు కె.రాఘవ అన్నారు. సుభాష్ చంద్రబోస్(రవన్న) 7వ వర్ధంతి కార్యక్రమాన్ని స్థానిక రామనర్సయ్య భవనంలో వెట్టి భారతి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాయల సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

కామవరపుకోట : యువత వ్యక్తిత్వ వికాసం అభివృద్ధి చేసుకోవాలని సెట్‌వెల్ సీఈవో ఎండీహెచ్. మెహరాజ్ కోరారు. స్థానిక మోడల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థినీ విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్‌పై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కెరీర్ కౌన్సిలర్ ఆర్.విజయ కుమార్, ప్రిన్సిపాల్ ఎం.మహేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాలకు వెళ్లడానికి లక్ష్యంతో కృషిచేయాలన్నారు. డిగ్రీ స్థాయి నుంచి ఆర్థిక ప్రణాళికలు అలవరచుకోవాలని విద్యార్థులకు ఉపదేశించారు. కార్యక్రమంలో కెరీర్ గైడెన్స్ కో–ఆర్డినేటర్ జి.శ్రీనివాస్, సెట్‌వెల్ ఏవో కె.జె.కెనడి, కళాశాల అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయినులకు సత్కారం

ద్వారకాతిరుమల: మహిళలు అన్ని రంగాల్లోను రాణించాలని మండల విద్యా శాఖాధికారిణి కె.అన్నమ్మ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా యూటీఎఫ్ మండలశాఖ ఆధ్వర్యంలో పలువురు మహిళా ఉపాధ్యాయినులను గురువారం ఘనంగా సత్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఈఓ అన్నమ్మ మహిళలనుద్దేశించి ప్రసంగించారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి జి.దేవానందరావు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జయరాజు, బీవీ రవీంద్ర, పి.మేరి పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

ద్వారకాతిరుమల: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో హేలాపురి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం వ్యక్తిత్వ వికాస శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రముఖ సైకాలజిస్ట్, హిప్నో థెరపిస్ట్, వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ వింజరపు జనార్దనం, అక్కింశెట్టి రాంబాబు మోటివేషనల్ శిక్షణ, అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. విద్యార్థుల్లో ఏకాగ్రత, నైపుణ్యాలు ఎలా అభివృద్ధి చేసుకోవాలో వివిధ ప్రక్రియల ద్వారా తెలియజేశారు. ప్రిన్సిపాల్ బి.రాణి, బీవీవీ సత్యన్నారాయణ, ఎ.శివప్రసాద్ తదితరులున్నారు.